క్లుప్తంగా

సారాతో వ్యక్తి అరెస్టు



తుపాకులగూడెంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెంలో సారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రాయుడు దానయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 35 లీటర్ల సారా, 5 కేజీల అమ్మోనియా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊట ధ్వంసం చేశారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై రవికుమార్, సిబ్బంది నారాయణ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, వీఆర్వో సాయి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

చాగల్లు: చిన్నారుల్లో నైపుణాలు పెంపొందించేందుకు శిక్షణ అవసరమని ఎంఈవో యు.గురునాథం అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ విడత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన అభ్యసన పద్ధతులతో చిన్నారులకు మానసిక వికాసం కలిగే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. బోధనకు ఉపయోగించే ఉపకరణాలను శిక్షణలో ప్రదర్శించారు. బోధనోపకరణాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సుభాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతి, జి. శిరీషా, రిసోర్సుపర్సన్ పిల్లి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సినిమా బృందాన్ని కలసిన మంత్రి దుర్గేష్



కుమారదేవంలో సినిమా హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ మహేష్‌బాబుతో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

కొవ్వూరు: కుమారదేవంలో మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడక్షన్‌లో నిర్మిస్తున్న ఆర్‌ఏపీ 022 షూటింగ్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. చిత్ర హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పి.మహేష్ బాబులను శనివారం మంత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. రామ్ కెరీర్‌లోనే ఈ చిత్రం అతిపెద్ద హిట్‌గా నిలవాలని ఆకాంక్షించారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో సినిమా షూటింగ్‌లకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి



సంత మార్కెట్‌లో మెప్మా బజార్

నిడదవోలు: స్థానిక సంతమార్కెట్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం మెప్మా బజార్ ఏర్పాటు చేశారు. మహిళలు స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మెప్మా బజార్‌లో ప్రదర్శించడంతో పాటు విక్రయానికి ఉంచారు. వినియోగదారులు మెప్మా బజార్‌ను సందర్శించి పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. మెప్మా బజారులో లభ్యమయ్యే ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళల జీవనోపాధికి సహకరించాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ జ్యోతి కోరారు. కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు వెంకటలక్ష్మి, సింధు, మాధవి, రిసోర్స్ పర్సన్‌లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

ఉండ్రాజవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. మండలంలో కె.సావరం గ్రామంలో శనివారం మంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ఇన్‌చార్జ్ బూరగడ్డ వేద వ్యాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

తాళ్లపూడి: ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ తెలిపారు. అన్నదేరోపేట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది రోడ్లు, వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. తడి చెత్త, పొడి చెత్తల నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే మలకపల్లిలోనూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- అధికారులకు ఆర్డీవో ఆదేశం
- మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత, డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న స్థానిక గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లపై శనివారం ఆమె అధికారులతో సమీక్షించారు. తొలుత అధికారులతో కలిసి క్షేత్రాన్ని సందర్శించారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తజనానికి ఏవిధమైన అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లు

గోష్పాద క్షేత్రంలో అదనపు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నదిలో స్నానాలు ఆచరించే భక్తులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రక్షణ వలయంగా పది బోట్లలతో పాటు పది మంది గజ ఈత గాళ్లను స్నానఘట్టాల వద్ద ఉంచాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ఈ నెల 24న బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 25న నిత్యోపోసన, బలిహారణం, సాంస్కృతిక కార్యక్రమాలు, 26న మహాశివరాత్రి పర్వదినం సదర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గోష్పాదక్షేత్రంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పార్కింగ్, బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం స్నాన ఘట్టాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. డీఎస్పీ జి.దేవకుమార్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఈ నెల 25వ తేదీ రాత్రి నుంచి ట్రాఫిక్‌ను మినీ బైపాస్ మీదుగా డీఎస్పీ ఆఫీస్ రోడ్డు నుంచి కాటన్ విగ్రహం రూట్‌కు మళ్లిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు, ఆర్‌అండ్ బీ డీఈ బీవీ రమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ పి.కృష్ణవేణి, సుందరేశ్వరస్వామి ఆలయం నిర్వాహకులు మానేపల్లి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవరచుకోవాలి



ఐ.పంగిడి హైస్కూల్లో స్కౌట్స్ యూనిఫాంతో విద్యార్థులు

కొవ్వూరు: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరుచుకోవాలని ఐ.పంగిడి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం మంగిన రామారావు సూచించారు. స్కౌట్ పితామహుడు బాడెన్ పావెల్ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్ పతాకావిష్కరణ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో విద్యార్థులకు స్కౌట్ యూనిఫాం సమకూర్చినట్లు ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా(పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ)కు పాఠశాల ఎంపికవ్వడంతో రూ.40 లక్షల నిధులను కేంద్రం విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో పాఠశాలలో గ్రంథాలయం, లేబొరేటరీ నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు స్కౌట్ యూనిఫాం ధరించి పాఠశాల గ్రౌండ్‌లో పెరేడ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు పితాని నాగేంద్ర, రవికుమార్, షేక్ రషీదా తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



పోతవరంలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: మండలంలో పోతవరం, కవులూరు, చీపురుగూడెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి తానేటి వనిత పరామర్శించారు. తొలుత మానగాని గంగారత్నం, పాతపాటి యువరాజు, ఆరుగొల్లు చంద్రయ్య, షేక్ కబీర్, తానేటి హరిశ్చంద్రప్రసాద్, కవులూరులో మద్దుకూరి రంగయ్య, చీపురుగూడెంలో జాలాది జర్నయ్య కుటుంబ సభ్యులను వనిత పరామర్శించారు. ఆయా కార్యక్రమాలలో మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రమణ్యం, బంక అప్పారావు, ముప్పిడివెంకటరత్నం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చిన్నీ నాగూయాదవ్, శెనగన సతీష్ గౌడ్, పెండ్యాల హరేరామకృష్ణ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి



తిరుగుడుమెట్టలో చెరువులోకి డ్రైన్ నీరు వదలొద్దని ఆందోళన చేస్తున్న రజకులు

తాళ్లపూడి: రజక వృత్తి దారుల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, కొన్ని చోట్ల రాజకీయ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలక పల్లికట్లయ్య అన్నారు. మండలంలోని తిరుగుడుమెట్టలో చెరువులోకి డ్రైన్ నీరు విడుదలను శనివారం రజకులతో కలిసి ఆయన అడ్డుకున్నారు. రజకుల సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కట్లయ్య, రజకులు మాట్లాడుతూ గ్రామంలో 50 కుటుంబాలు 60 ఏళ్ల నుంచి ఎల్లప్ ధర్మ చెరువులో రజక వృత్తి చేసుకుని జీవిస్తున్నట్టు తెలిపారు. చెరువులోకి గ్రామంలోని డ్రైన్ నీరు వదలడానికి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. అధికారులు స్పందించి చెరువులోని డ్రైన్ నీరు విడుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రజకులు పెదవేగి నాగేశ్వరరావు, బ్రహ్మయ్య, వీరాస్వామి, సత్యవతి, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని నివారించండి



పెరవలిలో దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

పెరవలి: దోమల వ్యాప్తికి ప్రధానంగా మురుగుగుంటలు, నీరు నిల్వ ప్రదేశాలు కారణమని అటువంటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమల బారి నుంచి రక్షణ దొరుకుతుందని తణుకు సెక్టార్ అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి భూపయ్య కాలువ గట్టుపై నివాసయోగ్యులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంట్లో వంటపాత్రల నుంచి వీధిలో ఉండే రుబ్బురోళ్లు, కొబ్బరి బొండాలు, మురుగునీటి కుంటల వద్దే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ పరిసరాల్లో ఎటువంటి చెత్తా చెదారం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అందుకు వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రకటించి సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. దోమల వలన ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలుతాయని అందుకు వాటి నివారణ కోసం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆశ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ పురోభివృద్ధికి కృషి చేయాలి



సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న సభ్యులు

నిడదవోలు: సంఘ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు కె.మదనమోహన్‌రెడ్డి కోరారు. స్థానిక మునిసిపల్ బీసీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిడదవోలు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలో ఉన్న వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. మదనమోహనరెడ్డి మాట్లాడుతూ సంఘ ప్రతిష్ట, వృద్ధుల సమస్యలపై మాట్లాడారు. ఇష్టం వచ్చినట్లు సంఘాన్ని నడపడం ప్రమాదకరమని, అది సంఘం విచ్ఛిన్నానికి దారితీస్తుందన్నారు. సీనియర్ సిటిజన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొండా నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా వృద్ధులు, మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు నిరోధించలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, కోశాధికారి దారపురెడ్డి సూర్యచంద్రరావు, కీర్తి ఆంజనేయులు, పొన్నా సుబ్రహ్మణ్యం, ముంగండ చిట్టిబాబు, గొన్నాబత్తుల రామారావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పుల్లూరి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నల్లజర్ల: సెయింట్స్ క్లారెట్స్ స్కూలులో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ జోసఫ్ శాంతప్ప ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫాదర్ సెబాస్టియన్ మాట్లాడుతూ విద్యారంగంలో యూకేజీ పూర్తి చేసుకొని మొదటి మెట్టుగా ఒకటో తరగతిలో ప్రవేశిస్తున్న మీరంతా ఉత్సాహంతో కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఫాదర్ జయరాజు, ఫాదర్ విజయకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి 'జ్ఞానజ్యోతి'

నల్లజర్ల: ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంఈఓ వై.సత్యనారాయణ అన్నారు. నల్లజర్ల జెడ్పీహైస్కూలులో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్య కొనసాగుతుందన్నారు. పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన చేస్తున్నట్టు చెప్పారు. వారిలో అధిక శాతం ఉపాధ్యాయ శిక్షణ పొందలేదని ఇక్కడ పిల్లలకు శాస్త్రీయ పద్ధతిలో బోధన జరగాలంటే అంగన్‌వాడీలలో బోధనా నైపుణ్యాలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఈ మేరకు ఐసీడీఎస్, సమగ్రశిక్షా, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. పిల్లలు మానసిక, శారీరకంగా అభివృద్ధి చెందేలా ఆటపాటలతో విద్యాబోధన చేయనున్నట్టు చెప్పారు. ఈ మేరకు బోధనకు సంబంధించిన అంశాలపై చార్టులు, మెటీరియల్ తయారు చేయడం, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంపై కార్యకర్తలకు నిపుణులతో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ శిక్షణ తర్వాత అంగన్‌వాడీలలో పూర్వ, ప్రాథమిక విద్యను బోధించే సామర్థ్యం పెరుగుతుందన్నారు. తద్వారా బాలల్లో చదువుపై ఆసక్తితో పాటు సృజనాత్మక భావనలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు వివిధ నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ జయలక్ష్మి, చిట్టిబాబు, కృష్ణవేణి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



సమిశ్రగూడెంలో తడి-పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ



తాడిపర్రులో పారిశుధ్య పనులను పరివేక్షిస్తున్న ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ

ఉండ్రాజవరం: మండలంలో 15 గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొని రోడ్లపై ఉన్న చెత్త చెదారాలతో పాటు డ్రైనేజీల్లో సిల్ట్‌ను తొలగించారు. అనంతరం ప్రజలకు తడి, పొడి చెత్త వేరువేరుగా పారిశుధ్య సిబ్బందికి అందజేసేలా అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో ఈ పారిశుధ్య పనులను ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, మండల శానిటరీ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, కార్యదర్శులు పర్యవేక్షించారు.

స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దాలి

నిడదవోలు రూరల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు తడి-పొడి చెత్త సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని 23 గ్రామాల్లో తడి-పొడి చెత్త సేకరణపై గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులను శనివారం నిర్వహించారు. సమిశ్రగూడెం, కాటకోటేశ్వరం, తాడిమళ్ల గ్రామాల్లో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పాల్గొని వ్యర్థాల నిర్వహణపై తగిన ప్రణాళిక ఉండాలని సూచించారు. తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరు చేసి డబ్బాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, టి.గోపాలకృష్ణ, మనోజ్ ప్రకాష్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

చాగల్లు: ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ తెలిపారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా శనివారం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణలో పలు సూచనలు చేశారు. గ్రామంలో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు



చిట్యాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోపాలపురం: యువత క్రీడల పట్ల ఆశక్తి పెంచుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ కె.సుభాషిని సూచించారు. గోపాలపురం మండలం చిట్యాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సుభాషిని మాట్లాడుతూ చిన్న గ్రౌండ్‌లో తక్కువ ఖర్చుతో క్రీడాకారులు అభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఒరిశాలో మార్చి 23 నుంచి 29వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలను మెమెంటో, సర్టిఫికెట్, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి జి.రామన్నదొర, ఏఎంఓ గౌరీశంకర్‌రావు, మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు చంద్రశేఖర్, రవీంద్ర, కేఎస్‌వీ సత్యనారాయణ, సీఆర్‌పీ కొయ్య నాగరాజు క్రీడాకారులు పాల్గొన్నారు.

వేంకటేశుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించడంతో భక్తులు స్వామివారిని చూసి తరించారు. తెల్లవారు జామున 4 గంటలకే మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం స్వామి వారి అభిషేకం కనులారా వీక్షించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. 7 గంటల తరువాత ఆలయానికి వేలల్లో భక్తులు రావటంతో దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధాన నిర్వహించారు. అన్నదానంలో 6 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఇటీవల నూతనంగా ఆలయంలో ప్రవేశపెట్టిన నిత్య గోత్ర నామార్చన, శుక్రవారం అభిషేకం గోత్ర నామార్చనకు, స్వామి వారికి పూల అలంకరణ, ప్రసాదం, అన్నదానానికి భక్తుల నుంచి విరాళాలు సేకరించటంతో భక్తుల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని ఆయన తెలిపారు.

చికెన్‌షాపులు తెరచుకోండి



కోడిమాంసం వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

నిడదవోలు: పట్టణంలో బర్డ్‌ఫ్లూ కారణంగా మూసివేసిన చికెన్ షాపులను తెరచుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి వ్యాపారులకు సూచించారు. బర్డ్‌ఫ్లూ కారణంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈనెల 11వ తేదీ నుంచి మూడు వారాల పాటు మాంసాన్ని విక్రయించరాదని పట్టణ పరిధిలో ఉన్న అన్ని చికెన్‌షాపుల వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. అయితే 11 రోజుల పాటు షాపులు మూసివేయడంతో వ్యాపారాలు లేక ఎంతో ఆర్థికంగా నష్టపోతున్నట్లు చికెన్ వ్యాపారులు శనివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణను కలుసుకుని విన్నవించుకున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ కృష్ణవేణి పలు ఆదేశాలను జారీ చేశారు. చికెట్ వ్యాపారులు తప్పనిసరిగా బతికి ఉన్న కోళ్లను మాత్రమే విక్రయించాలన్నారు. ఇద్దరు, ముగ్గురు వినియోగదారులు కలిసి బతికి ఉన్న కోళ్లను కొనుక్కొనేట్లు వ్యాపారులు వారికి చెప్పి వ్యాపారం చేసుకోవాలన్నారు. షాపుల ముందు కోళ్లను వేలాడగట్టిన మాంసాన్ని వినియోగదారులకు విక్రయించరాదని కమిషనర్ స్పష్టం చేశారు. అంతే కాకుండా చికెన్ రేట్లు కూడా ఇష్టం వచ్చినట్లు అధిక రేట్లకు విక్రయించరాదన్నారు. ప్రతి చికెన్ షాపు వద్ద ప్రతి రోజు మాంసం రేట్లను ప్రదర్శించాలని వ్యాపారులను ఆమె ఆదేశించారు. చికెట్ వ్యర్థాలను కొందరు వ్యాపారులు డ్రైన్లలో వేస్తున్నారని, అలా చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తాళ్లపూడి: విద్యార్థి దశలో కష్టపడి చదివితే అనుకున్న రంగంలో స్థిరపడటంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని ఇంటర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళి అన్నారు. తాళ్లపూడిలోని కరిబండి విద్యా సంస్థల్లో ఎస్‌కే జీఆర్, ఎస్ఎస్‌కే జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ఫేర్ వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గతంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళి, అధ్యాపకులు పాపారావు, ఎం.సత్యనారాయణ, రాజేష్, రాఘవేంద్ర, జ్యోతి, అమరేంద్ర, గీత, అరుణసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులును గెలిపించాలి

నల్లజర్ల: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులును గెలిపించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కొక్కిరపాటి వెంకట్రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పోతవరం, నల్లజర్ల గ్రామాల్లో సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను చూస్తే భూ సరిహద్దులు దాటిపోయాయన్నారు. చేతలు మాత్రం వారి పార్టీ కార్యాలయాల గేట్లు కూడా దాటలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యవాదులుగా ఫోజులు పెట్టి.. అధికారంలోకి వచ్చాక నియంతలుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టడానికి మత రాజకీయాలను తెర మీదకు తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణారావు, యు.రాజేష్, బి.వీరభద్రం, యు.వెంకటరమణ పాల్గొన్నారు.